# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- “స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర..” కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభించారు.
- ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకున్నపుడే రాజ్యాంగాన్ని కాపాడుకోగలమని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు.
- రాష్ట్రంలో పర్యాటకరంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.
- 'స్వచ్ఛత అనేది ప్రజల జీవన విధానంలో భాగమవ్వాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 118వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

===============================

“స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర..” కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైయస్సార్ జిల్లా మైదుకూరులో ఈరోజు ప్రారంభించారు. ఎన్‌టీ రామారావు 29వ వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రాయలసీమను అభివృద్ధి పథంలో నడిపిస్తామని, రాజోలి అనకట్ట పూర్తి చేసి 90వేల ఎకరాలకు సాగునీరందిస్తామని తెలిపారు.

(వాయిస్ 25 సెకన్లు)

ఇదిలా ఉండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నెల 3వ శనివారాన్ని “స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర..” దినంగా పాటిద్దామని పిలుపునిచ్చింది.

===============================

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకున్నపుడే రాజ్యాంగాన్ని కాపాడుకోగలమని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. విశాఖలో ఈరోజు జరిగిన “సంవిధాన్ గౌరవ అభియాన్” కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న ఆయన ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటించాల్సిన చర్యల గురించి వివరించారు. అర్హత గలిగిన ఓటర్లు తమ బాధ్యత గుర్తెరిగి ఓటింగ్ లో పాల్గొన్నపుడే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ఈనెల 25వ తేదీన ఓటర్ల దినోత్సవం నిర్వహించుకోవడంలో వుండే ఉద్దేశం కూడా అదేనన్నారు. రాజ్యాంగాన్ని కాలనుగుణంగా మార్చుకోవచ్చన్న డాక్టర్ అంబేద్కర్ మాటల్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

==============================

విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చడంలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు జిల్లా నందివెలుగు గ్రామంలో పూర్వ విద్యార్థుల సహాయంతో సుమారు 2 కోట్ల రూపాయలతో పాఠశాలలో నూతనంగా నిర్మించిన భవనాన్ని, క్రీడా ప్రాంగణాన్ని కేంద్ర మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదవాడిని ప్రపంచానికి పరిచయం చేసేది చదువేనన్నారు. గతాన్ని, జ్ఞాపకాలను మర్చిపోకుండా మేము సైతం అంటూ మంచి పాఠశాలను నిర్మించిన పూర్వ విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. ఎదిగే కోద్దీ ఒదిగి ఉండాలని, చదువు, సంస్కారం కలిస్తేనే విజయం లభిస్తుందని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రవాస భారతీయులను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు.

==============================

రాష్ట్రంలో పర్యాటకరంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో ఫ్లెమింగో ఫెస్టివల్ - 2025ను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల పాటు ఈ పక్షుల పండుగను నిర్వహిస్తుందని తెలిపారు. కాగా పులికాట్ సరస్సుకు శీతాకాలంలో భారీగా వలస పక్షులు వస్తుంటాయి. విదేశాలకు చెందిన అనేక రకాల అందమైన పక్షుల్లో ఫ్లెమింగోలే ఎక్కువగా ఉంటాయి. వాటికి స్వాగతం పలికేందుకు ప్రతీ సంవత్సరం ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహిస్తారు. అందులో భాగంగా ఈ పక్షులను వీక్షించేందుకు వచ్చే సందర్శకులకు అన్ని ఏర్పాట్లు చేసామని, రేపటి నుంచి రాష్ట్రంలో మరన్ని కార్యక్రమాలను ప్రారంభిస్తామని మంత్రి కందుల దుర్గేష్ వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

==============================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 118వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

విరామం

==============================

గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణి అన్నారు. ఈరోజు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో చైల్డ్ ఫండ్ సౌజన్యంతో సెంటర్ ఫర్ వరల్డ్ సాలిడారిటీ స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... స్వచ్ఛంద సేవా సంస్థలు గిరిజన పిల్లలను దత్తత తీసుకుని చదివించడం చాలా సంతోషంగా ఉందన్నారు. పిల్లలు పుట్టినప్పటి నుండి 6 సంవత్సరాల వరకు అంగన్వాడీ కేంద్రాల్లో ఉంచాలని, అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టిక ఆహారం పిల్లల్లో ఎదుగుదలకు తోడ్పడుతుందని అన్నారు. 6 సంవత్సరాలు నిండిన తరువాత ప్రభుత్వ

పాఠశాలకు పంపాలని సూచించారు. ఈ సందర్భంగా పిల్లలకు పౌష్టిక ఆహార కిట్లను, పాఠశాలల్లో చదివే పిల్లలకు పుస్తకాలు, స్టడీ మెటీరియల్, అంగన్వాడీ కేంద్రాలకు ఆట వస్తువులను మంత్రి అందించారు.

==============================

క్యాన్సర్ పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. గత సంవత్సరం నవంబర్ 14 నుండి ప్రారంభమైన స్క్రీనింగ్ 10 నెలల పాటు కొనసాగుతుంది. రాష్ట్రంలో సంవత్సరానికి దాదాపు 40 వేల మందికి పైగా క్యాన్సర్ తో ప్రాణాలు కోల్పోతున్నారు. దీనితో ఈ వ్యాధిని నిర్మూలించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 18 సంవత్సరాల పైబడిన వారికి నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, 30 సంవత్సరాలు పైబడిన మహిళలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ జరుగుతోంది. పరీక్ష కేంద్రాలలో బయాప్సీ, రేడియాలజీ పద్ధతుల ద్వారా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కీమో థెరపీ, రేడియేషన్ చికిత్సలను ప్రభుత్వ, అనుబంధ ఆస్పత్రులలో ఉచితంగా అందజేస్తారు.

==============================

'స్వచ్ఛత అనేది ప్రజల జీవన విధానంలో భాగం కావాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు. "స్వర్ణ ఆంధ్ర... స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా ఈరోజు గుంటూరు జిల్లా, నంబూరు గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ''2047 వికసిత్ భారత్ లో స్వచ్ఛత అనేది ప్రధాన అంశామని పేర్కొన్నారు. శుభ్రత అనేది ప్రజల ఆలోచనకు ప్రతిరూపం కావాలని కోరారు. భవిష్యత్ లో చెత్త కనిపించని భారతదేశం సాకారం కావాలని ఆయన ఆకాంక్షించారు.

(వాయిస్ 30 సెకన్లు)

==============================

పండుగ సీజన్ దృష్ట్యా తిరుగు ప్రయాణాల కోసం 8 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. రేపటి నుంచి ఈ రైళ్లు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. రేపు నరసాపురం, విశాఖపట్నం నుంచి రెండు రైళ్లు చర్లపల్లికి బయలుదేరుతాయని పేర్కొంది. సోమవారం చర్లపల్లి నుంచి విశాఖపట్నానికి మరో ప్రత్యేక రైలు ఉందని వెల్లడిస్తూ... దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి సీ.హెచ్.శ్రీధర్ ఒక ప్రకటన విడుదల చేశారు.

==============================

పశువుల ఆరోగ్యంతో పాటు వాటి ఉత్పాదకతను పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 20 నుంచి 31 వరకు పశుఆరోగ్య శిబిరాలను నిర్వహించనుందని విజయనగరం జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. పశు ఆరోగ్య శిబిరాలకు సంబంధించిన గోడపత్రికను ఈరోజు కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిబిరాల్లో ఉచితంగా పశువైద్యులు అందించే సేవలను వినియోగించుకొని.. పాల దిగుబడి పెంచేందుకు ప్రయత్నించాలన్నారు. శిబిరాల్లో పశువైద్య చికిత్సలు నిర్వహించడంతో పాటు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ, పశువ్యాధుల నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ పశు యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ వై.వి.రమణ తెలిపారు.

==============================
==============================